ప్రజాశక్తి

మంగళవారం 19 మార్చి 2024   8 పేజీలు






గుంటూరు   పల్నాడు

మార్కెట్‌లో ధర లేదు-గిడ్డంగిలో ఖాళీలేదు

- ఏం చేయాలో పాలుపోని మిర్చి రైతులు
- పంట దాచుకునేందుకు అగచాట్లు





గుంటూరులోని ఒక కోల్డ్ స్టోరేజ్‌లో ఖాళీ లేక బయట ఉంచిన మిర్చి టిక్కీలు... వినుకొండలో కోల్డ్ స్టోరేజ్ గేటుకు ఏర్పాటు చేసిన హౌస్‌ఫుల్ బోర్డు (ఇన్‌సెట్)

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి పండించిన మిర్చికి మద్దతు ధర లేకపోవడంతో రైతులు శీతల గిడ్డంగుల బాట పడుతున్నారు. సీజన్ ప్రారంభంలో రూ.25 వేలకు పైగా ఉన్న మిర్చి ధర ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.18-20 వేలకు పడిపోయింది. తాలు రకం నాణ్యతను బట్టి రూ.15-18 వేల నుండి రూ.9-12 వేలకు పడిపోయాయి. దీంతో వీలున్నంత వరకు రైతులు తమ పంటను శీతల గిడ్డంగులకు తరలిస్తున్నారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో మాచర్ల, దుర్గి, కారంపూడి, వినుకొండ, నరసరావుపేట, అధిక సంఖ్యలో చిలకలూరిపేటలో శీతల గిడ్డంగులున్నాయి. పల్నాడు ప్రాంతాల్లోని గిడ్డంగుల్లో ఖాళీ లేకపోవడంతో కొన్ని కోల్డ్ స్టోరేజీల వద్ద 'హౌస్‌ఫుల్' బోర్డులు పెడుతున్నారు. అధిక రవాణా ఖర్చులు చెల్లించి గుంటూరుకు తరలిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

గుంటూరులోనూ ఖాళీ దొరకని పరిస్థితి నెలకొందని, నిల్వ చేసుకునేందుకు అవస్థ పడుతున్నామని రైతులంటున్నారు. ఒక్కో టిక్కీకి రూ.200 వరకు వసూలు చేస్తున్నారని, గిడ్డంగుల్లో నిల్వ చేసిన పంటలకు బ్యాంకు వడ్డీ లేక్కన రుణాలివ్వాల్సి ఉన్నా శీతల గిడ్డంగుల యాజమాన్యాలు నిబంధనలు గాలికొదిలి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం శీతల గిడ్డంగులలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఖాళీలు లేవని గేటుకు తాళాలు వేసి బోర్డు తగిలిస్తున్నారు.

వినుకొండ టూ గుంటూరు

గుంటూరు టూ వినుకొండ

వినుకొండ మండలం ఉమ్మడివరానికి చెందిన రైతు ముంద్రు వెంకటేశ్వరరావు మిర్చి పంటను 10 రోజుల క్రితం విక్రయానికి గుంటూరులోని మిర్చియార్డుకు తరలిస్తే ధర లేకపోవడంతో గుంటూరులోని ఒక కోల్డ్ స్టోరేజికి తరలించారు. అక్కడ సగం టిక్కీలు నిల్వ చేసేందుకు మాత్రమే అవకాశం ఉందని చెప్పడంతో తిరిగి మొత్తం టిక్కీలను వినుకొండ కోల్డ్ స్టోరేజికి తరలించారు. రవాణా ఖర్చులు రూ.17 వేల వరకు అయ్యాయి. పెరిగిన పెట్టుబడులతో సాగు భారంగా మారిన మిర్చి సాగు ప్రస్తుతం ధర లేకపోవడంతో దాచుకోవడానికి కూడా అవస్థలు తప్పడం లేదని రైతు వాపోయారు. విత్తనం నుండి అమ్మకం వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా జరుగుతాయని ప్రభుత్వం చెప్పిన మాటలకు చేతలకు పొంతన లేదని నిట్టూర్చారు.



తెనాలిలో వీల్‌చైర్‌పై పరీక్ష రాస్తున్న విద్యార్థిని



కొచ్చర్ల వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన విద్యార్థి

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు గుంటూరు జిల్లాలో 95.68 శాతం, పల్నాడు జిల్లాలో 97.5 శాతం హాజరు
- పల్నాడులో రోడ్డు ప్రమాదానికి గురై పరీక్షకు గైర్హాజరైన విద్యార్థి

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

గుంటూరు పల్నాడు జిల్లాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటి రోజైన సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎక్కడా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోలేదని అధికారులు తెలిపారు. మొదటి రోజు 29,126 మంది విద్యార్థులకుగాను 27,868 మంది (95.68 శాతం) హాజరయ్యారు. 1258 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరిగింది. మొదటి రోజు కావటంతో ఉదయం 8 గంటల నుండే విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. గుంటూరు పలుచోట్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్థానిక కెఎస్‌ఆర్‌టి మున్సిపల హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. పరీక్షల్లో ఎలాంటి ▶ 2లో



సరుకు విక్రయించిన రైతులు తక్‌పట్టీ పొందాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల షెడ్యూలు వెలువడిన దృష్ట్యా మార్కెట్ యార్డులో రైతులు తమ సరుకును విక్రయించుకొని నగదు రూపంలో తీసుకొని వెళ్ళేటప్పుడు కమిషన్ వ్యాపారి నుండి తప్పనిసరిగా తక్‌పట్టీ పొందాలని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు ఆధారం లేకుండా అధిక మొత్తంలో నగదు తీసుకొని వెళితే ఉల్లంఘన కిందకు వస్తుందని, కావున సదరు నగదుకు తక్‌పట్టీ ఆధారంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

- పార్టీలు, అభ్యర్థులు నిర్దేశించిన ఫార్మేట్‌లో ఎన్నికల ఖర్చుల వివరాలివ్వాలి
- పార్లమెంట్ అభ్యర్థికి రూ.95 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థికి రూ.40 లక్షలు ఖర్చుకు అవకాశం
- రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల ఖర్చులు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఏప్రిల్ 25వ తేది నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు అని, 26న నామినేషన్ల స్క్రూట్నీ, 29న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అన్నారు. మే 13న ఎన్నికలు, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. జూన్ 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుందని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని, నియమవళి అమల్లోకి వచ్చిన 24 గంటల్లోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు, ప్రభుత్వ ప్రచార పథకాల పోస్టర్లు తొలగించామని వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల ప్రచార పోస్టర్లును 48 గంటల్లో తొలగించామన్నారు. ఎంపిగానీ, ఎమ్మెల్యే నిధులతో నిర్వహించే వాటర్ ట్యాంకులు, అంబులెన్సులు వంటి వాటిపై ప్రజా ప్రతినిధుల ఫొటోలు తీసివేయటం జరిగిందన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధుల పర్యటనలో అధికారులు పాల్గొనరని, ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లు అన్నింటిని రిటర్నింగ్ అధికారుల ఆధీనంలోకి తీసుకున్నారని తెలిపారు. మంజూరు చేసిన ▶ 2లో

భార్యపై దాడి కేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భార్యపై రోకలి బండతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పును సోమవారం వెలువరించారు. అమరావతి మండలం అత్తలూరుకు చెందిన కోట మేరికి అదే గ్రామానికి చెందిన కోట అర్జున్‌తో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. అర్జున్ మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్నాడగా వాటిని తాళలేక ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశార. పెద్దమనుషుల సమక్షంలో రాజీ కుదిర్చినా అర్జున్ పద్ధతి మార్చుకోపోవడంతో మేరీ తన పుట్టింటికి వెళ్లారు. 2022 మార్చి 16న అర్ధరాత్రి భార్య మేరీ పుట్టింటికి వచ్చిన ఆర్జున్ ఆమెపై రోకలి బండతో దాడి చేశాడు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా 498ఎ, 307 సెక్షన్ల కింద కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలుతోపాటు రెండు కేసుల్లో రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ సత్తెనపల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి.నాగవెంకటలక్ష్మీ పైమేరకు తీర్పును వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరి కొంతకాలం జైల్లో ఉండాలని తీర్పులో పేర్కొన్నారు. సాక్షులను సిఐ ఎం.బ్రహం కోర్టులో హాజరుపర్చగా ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.నరసింహారావు వాదించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం): 6.24

సహరీ (బుధవారం ఉదయం) : 4.56

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి పనుల్లో ప్రారంభం కాని వాటిని నిలిపేస్తామని, జరుగుతున్న పనులు యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. ఎన్నికల ఖర్చుకు సంబంధించిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్దేశించిన ఫార్మేట్‌లో ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ కమిటీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్ అభ్యర్థికి రూ.95 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థికి రూ.40 లక్షలు ఖర్చు చేసుకునే పరిమితి ఉందన్నారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ జి.రాజకుమారి మాట్లాడుతూ మంగళగిరిలో 4 వేల వరకూ తోపుడు బండ్లపై రాజకీయ పార్టీల ప్రతినిధుల బొమ్మలు, పేర్లు ఉన్నాయని వాటిని వెంటనే యజమానులు కవర్ చేసుకొన్న తరువాత మాత్రమే రహదారిపై వ్యాపారాలు నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. దుకాణాలపై ఏర్పాటు చేసి పార్టీ గ్లోసైన్ బోర్డులకు సంబంధించి యజమానులు డిక్లేరేషన్ అందించాలని, రహదారులపై ఏర్పాటు చేసిన బెంచీలపై ఉన్న రాజకీయ పార్టీల నాయకుల పేర్లను కవర్ చేయాలని అన్నారు. రాజకీయ పార్టీలు దీనికి సహకరించాలని కోరారు. సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్ఒ పి.రోజా, రిటర్నింగ్ అధికారులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో పి.శ్రీఖర్, గుంటూరు పార్లమెంట్ సహాయక రిటర్నింగ్ అధికారి భీమారావు, ఎలక్షన్ ఎక్స్‌పెండీచర్ కమిటీ నోడల్ అధికారి శివరామకృష్ణ , ఏఈఆర్ఓలు పాల్గొన్నారు. రాజకీయ పార్టీల నుండి ఆప్ నాయకులు డాక్టర్ సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, బిజెపి నాయకులు ఆర్.భాస్కరరావు, సిపిఎం నాయకులు వై.కృష్ణకాంత్, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, టిడిపి నాయకులు కె.శివరామయ్య, వైసిపి నాయకులు ఎ.జోసఫ్‌కుమార్ హాజరయ్యారు.



స్వర్ణకారులను మోసం చేస్తున్న వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - మంగళగిరి

స్వర్ణకారులను మాయ మాటలతో వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందని ఏపీ రాష్ట్ర స్వర్ణకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. వైసిపి తన పాలనలో స్వర్ణకారుల కోసం ఏమీ చేయలేదని, పైగా తాజా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు అంటూ హైడ్రా చేసి రిలే నిరాహార దీక్షలను విరమింజేసిందని అన్నారు. మంగళగిరిలో రిలే దీక్షలు చేపట్టిన స్థానిక స్వర్ణకార సంక్షేమ సంఘం నాయకులు, వైసిపి పార్టీ నాయకులతో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులతో ఒక సర్కిల్ కాపీని తెచ్చి జీవో అంటూ మోసం చేశారని ఆరోపించారు. మంగళగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్ ఇటీవల స్వర్ణకారులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకుని స్వర్ణకారులకు పరికరాలను ఇవ్వడంతోపాటు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేకంగా స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని, సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. మంగళగిరి స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు జగ్గవరపు రాము మాట్లాడుతూ టిటిడి మంగళ సూత్రాలను వ్యాపారం కోసం విక్రయిస్తోందని, వాస్తవానికి స్వర్ణకారులు చేసి మంగళ సూత్రాలు ఇవ్వాల్సి ఉండగా టిటిడి వారే మంగళసూత్రాలను విక్రయిస్తున్నారని, దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం తెచ్చిన 272 జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ గెలుపు కోసం స్వర్ణకారులందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో స్వర్ణకారుల సంక్షేమ కార్యదర్శి ఎం.రాము, శ్రీలక్ష్మీనరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.నాగరాజు, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, పిఆర్వోలు కె.నాగార్జున, ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.రాంకుమార్, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



గుంటూరులోని పుల్లయ్య స్కూల్ కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు... బోర్డులో నంబర్లు సరిచూసుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



గుంటూరులో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, డిఇఒ... నరసరావుపేట శంకర భారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

(మొదటి పేజీ తరువాయి)

మాల్‌ప్రాక్టీస్‌కు తావు లేకుండా చూడాలని డిఇఒ శైలజను కలెక్టర్ ఆదేశించారు. స్క్వాడ్‌లు 37 సెంటర్లను సందర్శించాయి.

పల్నాడు జిల్లాలో మొదటి రోజు పరీక్షలకు 25749 మంది హాజరవ్వాల్సి ఉండగా 25111 (97.5 శాతం) మంది హాజరయ్యారని జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. సార్వత్రిక విద్యా పీఠం కింద 10వ తరగతి పరీక్షలకు 1117 మంది విద్యార్థులకు గాను 1009 హాజరయ్యారని 108 మంది గైర్హాజరయ్యారన్నారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి 2079 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 1931 హాజరయ్యారని, 141 గైర్హాజరయ్యారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 62 మంది స్క్వాడ్, 86 మంది ఫ్లయింగ్ స్క్వాడ్, ఏడుగురు జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి. నరసరావుపేట పట్టణ సమీపంలోగల శంకర భారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పల్నాడు .జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. తాగునీరు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

వీల్‌చైర్‌లో పరీక్ష

గుంటూరు జిల్లా తెనాలిలోని వివేక స్కూలుకు చెందిన విద్యార్థిని పూజ భవాని అనారోగ్యంతో బాధపడుతూనే స్ట్రక్చర్ మీద పరీక్షకు హాజరయ్యారు. వీల్‌చైర్‌మీద పరీక్ష రాసేందుకు ఇన్విజిలేటర్, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి.రాజకిశోర్ అవకాశం కల్పించారు.

పరీక్షకు వస్తుండగా రోడ్డు ప్రమాదం

పదో తరగతి పరీక్షలు రాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కింద పడటంతో విద్యార్థి కాలికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొచ్చర్ల వద్ద చోటుచేసుకుంది. కొండ్రముట్లకు చెందిన వేమల సురేందర్‌రెడ్డి కొండ్రముట్ల జెడ్‌పి పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈపూరులోని జెడ్‌పి పాఠశాల పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తొలుత కొచ్చర్లలోని అంకాల పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి అనంతరం సొంతూరైన కొండ్రముట్లకు బయలుదేరాడు. ఈ క్రమంలో కొచ్చర్ల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో కాలికి తీవ్ర గాయమైంది. సురేందర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం వినుకొండలని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయం కారణంగా పరీక్షకు హాజరు కాలేదు.



రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటిస్తే నిర్వహణ సులభం

ప్రజాశక్తి-తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరులో సోమవారం 'కన్స్ట్రక్షన్ అండ్ క్వాలిటీ కంట్రోల్ పేమెంట్స్' అంశంపై సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సెంట్రల్ రోడ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ మాజీ చీఫ్ సైంటిస్ట్ కె.రామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక టెక్నాలజీని వివరించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ముఖ్యమని, ఫలితంగా వాటి నిర్వహణ కూడా సులభతరమని, ఎక్కువ కాలం మన్నిక ఉంటుందని చెప్పారు. నాణ్యత లోపాలుంటే ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా అయన్ను వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ సత్కరించారు. సదస్సులో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ప్రైవేటు స్థలాల్లో బోర్డులకు అంగీకార పత్రం తప్పనిసరి

ప్రజాశక్తి - గుంటూరు : గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రైవేటు స్థలాల్లో, భవనాలలో ఏర్పాటు చేసే రాజకీయ పార్టీల ప్రచార ఫ్లెక్సీలు, జెండాలు, బోర్డులకు సదరు స్థల, భవన యజమాని అంగీకార పత్రం తప్పనిసరి అని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్.ఓ) కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, సిటీ ప్లానర్ తన చాంబర్‌లో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై సమావేశమయ్యారు. సిటీ ప్లానర్ మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలలో ప్రధాన వీధులు సెంటర్లలోని రాజకీయ పార్టీల బోర్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించామని, మంగళవారం మధ్యాన్నం నాటికి ప్రైవేటు స్థలాలు, భవనాలలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రచార బోర్డుల తొలగింపు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. ప్రైవేటు స్థలాల్లో, భవనాలపై ఏర్పాటు చేసే రాజకీయ పార్టీల బ్యానర్లు, బోర్డులకు సదరు యజమాని అంగికర పత్రం లేకుంటే వాటిని మంగళవారం మధ్యాహ్నం తరువాత పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. పార్టీల ఆఫీస్‌లకు కూడా ఎన్నికల్ సంఘం నిబంధనల మేరకు 4/8 సైజ్‌లో ఒక జెండా, ఒక బోర్డు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సచివాలయ ప్లానింగ్, ఎమినిటి కార్యదర్శులకు తమ పరిధిలో ఉన్న ప్రైవేటు స్థలాలు, భావనాల్లో ఉన్న రాజకీయ పార్టీల బోర్డులు, బ్యానర్లను గుర్తించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్ఓలు వెంకట లక్ష్మి, సునీల్, నిరంజన్, భీమరాజు, సూపరిండెంట్ పద్మ, టిడిపి నుండి సి.హెచ్ వన్య, బిఎస్పి నుండి సిహెచ్.వాసు, అమ్ ఆద్మీ నుండి టి.సేవకుమార్, కాంగ్రెస్ నుండి మహబూబ్ జాని, సిపిఎం నుండి షేక్ ఖాసిం షహీద్ పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ప్రజాశక్తి - తాడికొండ : యువతి, యువకులు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగవచ్చునని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిటిస్ట్ డాక్టర్ ఎం.యగంధర్ కుమార్ అన్నారు. లాంఫాంలోని కేవీకే ఆధ్వర్యంలో పండ్లు, కూరగాయల విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యుగంధర్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. పండ్లు, కూరగాయలతో అనేక రకాలైన నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేయవచ్చని చెప్పారు. కల్తీలేని ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. మార్కెట్లో దొరికే ఉత్పత్తులతో పోల్చిచూస్తే మనం స్వయంగా నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి చిన్నచిన్న పరిశ్రమలతో ఆదాయం పెంచుకోవచ్చని వివరించారు. ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ పీ.రామాంజనేయులు మాట్లాడుతూ యువతకు నైపుణ్యత పెంచే విధంగా కేవీకే శిక్షణ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. నైపుణ్యాలు పెంచుకొని స్వయం ఉపాధి కార్యక్రమాలు కేవీకే చేపట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మంగళగిరి ఏడీఏ జేఎన్‌ఎం పుణ్యవతి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎం.దీప్తి పాల్గొన్నారు.

ప్రభుద్ధ రిపబ్లికన్ పార్టీ గుంటూరు ఎంపీ అభ్యర్థిగా అనిల్ కుమార్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రభుద్ధ రిపబ్లికన్ పార్టీ గుంటూరు లోకసభ అభ్యర్థిగా జెల్ది అనిల్ కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు ప్రకటించారు. సోమవారం గుంటూరులోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విస్తృత సమావేశంలో చెన్నకేశవులు మాట్లాడుతూ పదేళ్ల నుండి సేవారంగంలో, దళిత బహుజన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్న జెల్ది అనిల్ కుమార్‌కు గుంటూరు ఎంపీ అభ్యర్థిగా బీఫాం ఇచ్చామని, రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఆయన విజయానికి తోడ్పడాలని చెప్పారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ ఫ్రెంట్ నుండి యువతకు ప్రాధాన్యం ఇస్తూ తనను ఎంపిక చేశారన్నారు. దీనికి మద్దుత్తుగా ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ ఫ్రెంట్ రాష్ట్ర అధ్యక్షులు జె.డి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు జి.యస్.ఆర్.కె.ఆర్. విజయ్ కుమార్, ప్రజా పార్టీ అధ్యక్షులు కె.యస్.భాగ్యారావు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుద్ధ రిపబ్లిక్ పార్టీ బాపట్ల ఎంపి అభ్యర్థి పైనం జాన్‌బాబు, ప్రకాశం జిల్లా అధ్యక్షులు లింగంగుంట శంకర్ పాల్గొన్నారు.

షైన్ ఆనంద శరణాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : చినకాకాని ష్కెన్ ఆనంద శరణాలయంలో సోమవారం కాస్ట్ కో సంస్థ ఆధ్వర్యంలో ఆశ్రమంలోని బాలబాలికలకు అన్నదానం చేశారు. ముందుగా ఆశ్రమంలోని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి అనంతరం మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. కాస్ట్ కో మంగళగిరి ఇన్‌ఛార్జి తాడిబోయిన రవివర్మ మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో కాస్ట్ కో సంస్థలో ఇప్పటికే 50 మంది చేరి ఉపాధి పొందుతున్నారని, తమ సంస్థ ద్వారా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆశ్రమంలోని బాలబాలికలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో తమ సంస్థ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయడానికి సిద్ధంగా ఉన్నామని కాస్ట్ కో ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో తాడిబోయిన వెంకటేశ్వరావు, పురం అనిల్, తాడిబోయిన శివబాబు, తాడిబోయిన శివశంకర్, తాడిబోయిన సీతారామయ్య, ఆలా శ్రీకాంత్, పేరం వాసు, రామచంద్ర మహేష్ పాల్గొనారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	1,35,164
మిర్చి ఎగుమతి	:	1,28,403
మిర్చి నిల్వ	:	84,046

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 19,500
నెం.5	9,500 - 17,000
273	12,500 - 15,000
341	9,000 - 18,500
సూపర్ 10	13,000 - 13,000
నాన్ ఎసి	
తేజ	9,000 - 21,000
బడిగి	9,000 - 18,000
దేవనూరు డీలక్స్	10,000 - 18,500
తాలుకాయలు	5,000 - 12,500

'ఏ ఒక్క హామీ ఇవ్వని మోదీ పర్యటన ఎందుకు?'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బిజెపి, టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి సభ 'ప్రజాగళం' ఆదివారం బొప్పూడిలో జరిగిన విషయం తెలిసిందే. ఈ సభపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.రాధాకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది 'ప్రజాగళం' కాదని, ప్రజల మీద చిమ్మిన గరళం అని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పదేళ్ల పాలనలో దేశం గర్వపడే విధంగా కానీ, ప్రజలు మెచ్చుకునే ఏ ఒక్క పని అయినా చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా తెలుగుదేశం,జనసేనతో,పరోక్షంగా వైసిపితో పొత్తు పెట్టుకున్న బిజెపికి, మోడీకి తెలుగు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. మోడీ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కి గాని, పల్నాడు జిల్లాకు గానీ , ముఖ్యంగా చిలకలూరిపేట ప్రాంతానికి గాని మేలు చేసే ఏ ఒక్క హామీ కూడా ఇవ్వకపోవడం ఈ ప్రాంత ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. చిలకలూరిపేట ప్రాంత ప్రజల చిరకాల వాంఛ రైల్వే లైన్ మంజూరు కు సంబంధించి నరేంద్ర మోడీ ద్వారా హామీ ఇప్పిస్తారని భావించిన ప్రజలకు, మోడీ,బాబు, పవన్ లు మొండిచేయి చూపించారని విమర్శించారు. విభజన చట్టంలోని హామీలను పూర్తిగా గాలి కొదిలేసిన మోడీకి రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఈ మూడు పార్టీల కూటమికి మైనారిటీలు, దళితులు, దళిత క్రైస్తవులు, బలహీన వర్గాలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

సమిష్టి కృషితో విజయవంతం : టిడిపి

ప్రజాశక్తి-వినుకొండ

రాష్ట్రంలో జగన్ రెడ్డి అవినీతి, అరాచక పాలనను వ్యతిరేకిస్తూ 'ప్రజా గళం'తో సందేశమిచ్చిందని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. తన నివాసంలో సోమవారం జరి గిన విలేకరుల సమావేశంలో జీవి ఆంజనేయులు మాట్లాడుతూ టిడిపి-జనసేన-బిజెపి సమిష్టి కృషితో ప్రజా గళం సభ విజయ వంతమైందని అన్నారు. 12 కిలో మీటర్ల దూరం వరకు ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు భారీగా తరలి వచ్చారన్నారు. బహిరంగ సభ వద్ద పోలీసుల వైఫల్యం ఉంద న్నారు. దేశ ప్రధాని హాజ రైన సభకు పోలీసుల నిర్లక్ష్యం కార ణంగా ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గుర య్యారని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన విషయం అధికారులు గ్రహించి పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయాన్ని అధికారులు, సచివాలయ ఉద్యో గులు సిబ్బంది గుర్తుంచుకోవాలని, సీసీ కెమెరాలు అన్ని రికార్డు అవుతాయని ఎన్నికల నిబం ధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్ప వని అన్నారు. బొల్లా బ్రహ్మనాయుడు ఇంటికి అధికారులు వెళ్తున్నట్లు తెలుస్తోందని, అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

ఎమ్మెల్యే అబద్ధాలు తగదు

మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేయని పనులను చేసినట్లుగా అబద్ధాలాడి ప్రజలను మోసం చేస్తున్నారని విమ ర్శించారు.

విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ 100 పడకల ఆసుపత్రి ఎక్కడ? ముస్లిం మైనారిటీ కాలేజీ ఎక్కడ? రింగ్ రోడ్డు, రెండు పూటలా నీరు ఇవన్నీ ఎక్కడో చూపించాలన్నారు.

జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి, జనసేన, బిజెపి పార్టీల జెండాలు వేరైనా ఏజెండా ఒకటేనని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. స్థానిక టిడిపి కార్యా లయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఉమ్మడి కార్యాచరణతో రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఉమ్మడి ప్రణాళికలు రచించడం జరుగుతుందని అన్నారు.

మాజీ సిఎం రోశయ్య విగ్రహాన్ని రాత్రికి రాత్రే ఎందుకు ప్రతిష్టించారు?

రాష్ట్ర బిసి యునైటెడ్ ఫ్రంట్ నాయకులు

ప్రజాశక్తి- వినుకొండ

మాజీ సీఎం కొనిజేటి రోశయ్య విగ్రహాన్ని వినకుండా పట్టణం నరసరావుపేట రోడ్డులో రాత్రికి రాత్రి హడావుడిగా ప్రతిష్టించడంలో ఆంతర్యం ఏమిటని రాష్ట్ర బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరావు ఎమ్మెల్యేని ప్రశ్నిం చారు. సోమవారం ఆయన మాటా ్డుతూ ఎమ్మెల్యేగా గెలిచిన ఐదళ్లలో గుర్తుకురాని మాజీ సీఎం రోశయ్య విగ్రహం ఎన్నికల కోడ్ ముందు గుర్తుకు రావటం విడ్డూరంగా ఉందన్నారు. రోశయ్య విగ్రహం పేరుతో వైశ్య సామాజిక వర్గాన్ని మోసం చేయాలని కుట్రపూరితమని, వైశ్యుల ఓట్లను ఆకట్టుకునేందుకు ఇది ఎత్తుగడ అని విమర్శించారు. రాజ కీయ స్వార్థం కోసం అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, నియోజకవర్గ ప్రజలు ఈ వింత పోకడలను గమనిస్తున్నారన్నారు. ఇటువంటి చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న పాలకులను ప్రజలు గుర్తించి ఎన్నికలప్పుడు గుణపాఠం చెప్పాలని కోరారు.



విద్యార్థులను పుస్తకపఠనం వైపు మళ్లించండి

నరసరావుపేట శాఖా గ్రంథాలయాన్ని పరిశీలించిన సుబ్బరత్నమ్మ

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంక దారి సుబ్బరత్నమ్మ సోమవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠకులతో, విద్యార్థులతో ఆమె మాట్లాడారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు అవసరమైన అన్ని పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఇంకా ఏమైనా పుస్తకాలు అవసరమైతే కనుక గ్రంథాలయ అధికారి వద్ద గల ఆన్ డిమాండ్ పుస్తకంలో నమోదు చేస్తే, ఆయా పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి శాఖా గ్రంథాలయానికి సరఫరా చేస్తారని చెప్పారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని సందర్శించారు. తగిన మరమ్మతులు చేయించాలని చెప్పారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు రానున్న వేసవి కాలంలో గ్రంథాలయాలకు రావాలని, జ్ఞానాన్ని, తెలివిని సంపాదించుకోవాలని అన్నారు. నేటి జీవితంలో విద్యార్థులు అధికంగా సెల్ ఫోన్లకే అతుక్కుపోతున్నారని, ఈ విషయమై వారి తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని వారిని పుస్తక పఠనం వైపు మళ్లించాలని సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 97 శాఖా గ్రంథాలయాలను పాఠకులు ,విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



హోర్డింగులపై రాజకీయ పార్టీల బొమ్మలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నప్పటికీ సత్తెనపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ హోర్డింగులు పై రాజకీయ పార్టీల బొమ్మలు తొలగించ కుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. తాలూకా సెంటర్ నుండి వెంగరెడ్డినగర్ వరకు డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఆ హోర్డింగులపై వైయస్ రాజశేఖరరెడ్డి , జగన్ చిత్రాలు ఉన్నాయి. రాజకీయ నాయకుల బొమ్మలు కనపడ కుండా చేయాలనే ఎన్నికల నియమావళిని పట్టించుకోని అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారానికి కూడా రాజకీయ నాయకుల బొమ్మలు ఉన్నా వాటిని కనపడకుండా చేయలేదు. పట్టణంలో ని వివిధ వార్డుల్లో గోడలకు అంటించిన బ్యానర్లు కూడా మున్సిపల్ తొలగించలేదు. ఆయా రాజకీయపార్టీల బ్యానర్లు, నాయకుల చిత్రాలను తక్షణం తొలగించాలని, హోర్డింగులు పై ఉన్న బొమ్మలను కనపడకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.





రొంపిచర్ల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు తల్లిదండ్రులు

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా జరుగుచున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎలాంటి సెల్ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమలు చేస్తూ, పెట్రోలింగ్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాల సమీప ప్రాంతాల్లో పరీక్షలు ముగిసేంతవరకు జిరాక్స్/ప్రింటింగ్ సెంటర్లను పోలీసులు మూసివేయించారు.పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా, సాఫీగా జరగడానికి పోలీస్ శాఖ తరుపున అన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను తీసుకు వచ్చి, పరీక్ష ముగిసిన తర్వాత జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్ లో జమ చేసే వరకు పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



మాచర్లలోని పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థినీ విద్యార్థులు



సత్తెనపల్లిలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

పట్టణంలో ఆరుపరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1495 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 74 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు. డివిజన్ పరిధిలో అయితే మొత్తం 58 సెంటర్లు ఏర్పాటు చేశారు. 11,036 మంది హాజరు కావాల్సిఉండగా 10,715 మంది విద్యార్థులు హాజరుకాగా 32 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఉప విద్యాశాఖధి కారి వెంకటేశ్వరావు తెలిపారు

ప్రజాశక్తి - రెంటచింతల

పదో తరగతి పరీక్షలకు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ -2 శివ నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం నాలుగు సెంటర్లలో నిర్వహించిన పరీక్షలకు 740 మందికి గాను 731 మంది హాజరయ్యారన్నారు.మొత్తం 38 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించినట్లు చెప్పారు.



ఈపూర్‌లోని పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు హైస్కూలులో మొదటి రోజు పరీక్షకు 224 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ విషయాన్ని చీఫ్ ఎగ్జామినర్ లక్ష్మీ నారాయణ, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ మలిఖార్జున రావు తెలిపారు.

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల మండలంలో మొత్తం 8 పరీక్ష కేంద్రాల్లో తొలి రోజు పరీక్షకు 1,606 విద్యార్థులకు గాను 1,556 మంది హాజరైనట్లు ఎంఇఒ వేముల నాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ వేసవి ఎండల దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈపూరు పరీక్ష కేంద్రంలో ఆర్జెడి తనిఖీ

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆర్జెడి లింగేశ్వర రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం పక్కనే వసతి గహాలలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల తరగతులు నిర్వహణ పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందికరంగా మారొచ్చని గదుల మార్పులు చేయాలని చీఫ్ సూపరింటెండెంట్ రామకోటేశ్వరరావుకు సూచించారు.విద్యార్థులకు ఏర్పాటుచేసిన మౌలిక వసతులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. పరీక్షల అనంతరం ఎంఈఓ 2 రామ తులసి మాట్లాడుతూ ఈపూరు,ముప్పాళ్ళ పరీక్ష కేంద్రాలలో పదో తరగతి చివరి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఎంఈఓ 2 రామ తులసి తెలిపారు. మండలంలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ,ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 499 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 489 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఆమె తెలిపారు. ఈపూరు పరీక్షా కేంద్రంలో 300 మంది విద్యార్థులకు 294 మంది,ముప్పాళ్ళ పరీక్షా కేంద్రంలో 199 మంది విద్యార్థులకు 195 మంది పరీక్షలు రాశారన్నారు. పదిమంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

‘వాలంటీర్లు... ప్రచారానికి వెళ్దాం’

- గురజాల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి
- ఇంతకాలం వేతనాలిచ్చాంగా వైసిపి కోసం పనిచేయండి
- వాలంటీర్లకు వైసిపి నాయకులు అనధికారిక ఆదేశాలు

ప్రజాశక్తి - గురజాల

ఎన్నికలకు సంబంధించి ఎలాంటి విధులను వాలంటీర్లకు అప్పగించడం లేదని, వారు పరోక్షంగా ఎవరికైనా సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ హెచ్చరించిన విషయ తెలిసిందే. కానీ జిల్లాలో పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితి భిన్నంగా ఉంది. ఇంటింటికి వెళ్ళాలి తప్పనిసరిగా రావాలంటూ. వైసిపి నాయకులు ఫోన్ల ద్వారా వాలంటీర్లకు సందేశాలు పంపుతున్నారు. గురజాల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో, సాయంత్రం త్వరగా వస్తే ఇంటింటికి వెళామని, దాదాపు అన్ని వీధులు ప్రచారం చేద్దామని వైసిపి నాయకులు వాలంటీర్లకు అనధికార ఆదేశాలిస్తున్నట్లు సమాచార.

ఆందోళనలో వాలంటీర్లు

జిల్లా వ్యాప్తంగా వాలంటీర్లకు వివిధ పనులను ఆయా నియోజకవర్గాల ప్రతినిధులు అప్పగించేస్తున్నారు. ఈ నెల వేతనం నెలాఖరుకు పడుతుందని, మరో రెండు నెలల పాటు వైసిపి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు చూసుకుంటారని, మీరు మాత్రం ఇంటింటికి వెళ్ళడానికి సిద్ధం కావాలని చెబుతున్నారు. ప్రస్తుతం అధికారికంగా ఎలాంటి విధులు లేక పోయినా, ఇంతకాలం వేతనాలు ఇచ్చిన వైసిపి కోసం పనిచేయాలని మరో రెండు నెలల్లో తామే మళ్లీ అధికారంలోకి వస్తామని వాలంటీర్లకు చెబుతున్నారు. ఇప్పుడు వాలంటీర్లు దూరంగా ఉంటే ఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందో, ఏ ఇంటికి ఏ పథకాలు వచ్చాయో ఎలా తెలుస్తుందని చెబుతున్న నాయకులు, వాలంటీర్లను రప్పించుకుంటున్నారు. నాయకుల మాటలు నమ్మి ఇంటింటికి ప్రచారానికి వెళ్తే ఈసీ ఆదేశాలు ఉల్లంఘించినట్లు అవుతుందని వాలంటీర్లు మదన పడుతున్నారు.

సి విజిల్‌లో యాప్ ద్వారా ఇప్పటికే ఫిర్యాదులు : కలెక్టర్

- వంద నిముషాల్లో పరిష్కరించాలని, నివేదించే ముందు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశాలు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎన్నికల విధులు తూ.చా తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై చేపడుతున్న చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈసిఐ గైడ్‌లైన్స్ మేరకు ఎన్నికల విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారికి ప్రతి రోజు సమర్పించాల్సిన నివేదికలను పంపించే ముందు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలోపు పంపించాలన్నారు. ముఖ్యంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించిన నివేదికలు సకాలంలో అందించాలని, వాటిని కన్సాలిడేట్ చేసి రాష్ట్ర ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. సి విజిల్‌లో ఇప్పటికే కొన్ని కంప్లైంట్స్ వచ్చి వున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదు అందిన వంద నిమిషాలలోపు సి విజిల్ కంప్లైంట్స్ పరిష్కరించాలని స్పష్టం చేశారు. సమీక్షలో జేసీ రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్‌ఓ పి.రోజా, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

న్యాయ శాస్త్రంలో సువర్చల శశికిరణ్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - తెనాలి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పొన్నెకంటి సువర్చల శశికిరణ్ న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. 'సైబర్ క్రైమ్ లాస్ విత్‌ఇన్ ది క్రిమినల్ ఫ్రేమ్ వర్క్ ఇన్ ఇండియా, చేంజింగ్ పెరడైమ్స్ అండ్ పర్స్పెక్టివ్స్' అంశంపై డాక్టర్ కె.శ్రీగౌరి పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి డాక్టరేట్ ప్రధానం చేసేందుకు ఉత్తర్వులి చ్చినట్లు శశికిరణ్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరుకు చెందిన శశికిరణ్ జెజె గ్రూప్ సంస్థల ఛైర్పర్సన్‌గా ఉన్నారు. ఆమె పదో తరగతి వరకు కొలకలూరులో, అనంతరం గుంటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎల్సీఈ డిప్లమా పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్బి పూర్తి చేసిన ఆమె, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్ఎం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎ, అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ, సెనేట్ ఆఫ్ సిరంపూర్ నుంచి బ్యాచిలర్ ఆఫ్ క్రిస్టియన్ స్టడీస్ పూర్తి చేశారు. తాజాగా ఎఎన్‌యు నుంచి పీహెచ్డీ పొందిన ఆమెను విశ్రాంత ఐఎఎస్ అధికారి పి.దయాచారి, ఎఎన్‌యు ప్రొఫెసర్ డాక్టర్ పిజె రత్నాకర్, డాక్టర్ వి.రామారావు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య

మంగళగిరి నుండి ఇండియా బ్లాక్ అభ్యర్థి పోటీ

ప్రజాశక్తి - మంగళగిరి

రావన్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మంగళగిరిలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి వి.వి జవహర్లాల్ అధ్యక్షత వహించగా చెంగయ్య మాట్లాడుతూ దేశాన్ని మతం పేరుతో చీల్చే బిజెపి కూటమిని ఓడించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే బిజెపితోపాటు దాని మిత్రపక్షాలను ఓడించాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో వైసిపి ప్రభుత్వం బిజెపి విధానాలకు మద్దతిస్తూ పాలన సాగిస్తోందని, ఆ పార్టీనీ ఓడించాలని ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మంగళగిరి అసెంబ్లీకి ఇండియా బ్లాక్ అభ్యర్థి పోటీ చేస్తారని, వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు ఎం.బాలాజీ, కె.ఏడుకొండలు, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం



అరవింద మోడల్ స్కూల్ వద్ద పరీక్షా కేంద్రం వద్దకు పిల్లలను తీసుకొని వచ్చిన తల్లిదండ్రులు



మారిస్ పేట పాఠశాలవద్ద తమకు కేటాయించిన హాల్స్ చెక్ చేసుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ, రూరల్ గ్రామాల్లో 12 సెంటర్లో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మంగళగిరి పట్టణంలో ఆరు సెంటర్లోనూ, రూరల్ గ్రామాల్లో ఆరు సెంటర్లోనూ మొత్తంగా 2,460 పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2,363 హాజరయ్యారు. 96 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను తల్లిదండ్రులు తీసుకొచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మారిస్ పేటలో చెంచు రామానాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద తమకు కేటాయించిన ఎగ్జామ్ హాల్స్‌ను విద్యార్థులు పరిశీలన చేసుకొని గదులకు చేరుకున్నారు. ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం పాఠశాలలో పరీక్షరాసే విద్యార్థులు ఆయా కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కేంద్రాన్ని ఏర్పాటు చెసినట్లు పాఠశాల చిత్రలేఖనోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ తెలిపారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 258 మంది విద్యార్థిని, విద్యార్థులకు గాను, 15 మంది సప్లమెంటరీ విద్యార్థులు, మరో ఇద్దరు రెగ్యులర్ విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామ్స్ సూపరెంటెంట్ సిహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులేమీ లేకుండా ఏర్పాట్లు చేశామని, తొలిరోజు అందరూ ప్రశాంతంగా పరీక్షలు రాశారని చెప్పారు.

చిర్రావూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులు మొత్తం 41 మందికి గాను, 35 మంది నూతక్కి జడ్పీ హైస్కూల్లో పరీక్షలకు హాజరవ్వగా, ఐదుగురు విద్యార్థులు ఆబ్సెంట్ అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ ఒక ప్రకటనలో తెలిపారు.



పేరేచర్ల యాపిల్ స్కూల్లో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల వ్యాప్తంగా మొత్తం విద్యార్థులు 890 మంది ఉండగా 856 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో మొత్తం 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్ సిరిపురం, జిల్లా పరిషత్ హైస్కూల్, మేడికొండూరు, సింగ్ సీతారామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ పేరేచర్ల, యాపిల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పేరేచర్ల కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.



సచివాలయంలో ప్రశ్నిస్తున్న టిడిపి నాయకులు

ఎన్నికల కోడ్ అందరికీ వర్తించదా?

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎన్నికల కమిషన్ విధించిన ఎన్నికల కోడ్ అన్ని పార్టీలకు వర్తించదా? అని సోమవారం ఉండవల్లి సెంటర్ సచివాలయం ముందు టిడిపి కార్యకర్తలు నిరసన తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు పేరుతో టిడిపి ఫ్లెక్సీలు, సిమెంటు బల్లలు తొలగించిన తీరు పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. వైసిపి ఫ్లెక్సీలు తొలగించకుండా ఉద్దేశపూర్వకంగా తమ పార్టీకి చెందిన వాటిని తొలగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అధికారులు సమాధానం చెప్పకుండా బయటకు వెళ్లిపోవడంతో టిడిపి కార్యకర్తలు అక్కడే కొద్దిసేపు బైటాయించి నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అందరినీ సమదృష్టితో చూడాలని కోరారు.



జాబ్‌మేళా బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న అంకప్ప చౌదరి తదితరులు

పిబిఎన్ కాలేజీలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

నిడుబ్రోలులోని పిబిఎన్ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటల నుండి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శివకుమారి, చైర్మన్ కెప్టెన్ అంకప్ప చౌదరి సోమవారం తెలిపారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న, బీఎస్సీ, బీకాం, బీసీఏ ఉత్తీర్ణులైన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. పట్టణ పరిసర ప్రాంతాల్లోని విద్యార్థిని విద్యార్థులు అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు బ్రోచర్‌ను అంకప్ప చౌదరి తదితరులు ఆవిష్కరించారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, (వెన్యూ టూర్) అక్షిత ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, అధ్యాపలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటీటీ ప్లాట్‌ఫాంలపై వేటు సబబే : దిలీప్‌రాజా



ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేంద్ర ప్రభుత్వం తాజాగా 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను నిషేదించడం సముచితమేనని మా ఎపి వ్యవస్థపాకులు, సినీ దర్శకులు దిలీప్‌రాజా అన్నారు. తెనాలి పెదరావూరులోని ఆయన స్టూడియోలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఓటీటీలకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ లిస్టులోపెట్టి మితి మీరిన శంగారాన్ని అదుపులో పెట్టే ప్రయత్నాన్ని కేంద్ర సమాచార ప్రసార శాఖ అరికట్టిందన్నారు. దీనివలన 57 సోషల్ మీడియా ఖాతాలు, 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లపై భారతదేశంలో వేటు పడిందన్నారు. ఈ అంశాన్ని తాను ఎన్నోసార్లు కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి మురుగన్‌కు మొరపెట్టుకున్నానని, ప్రసారభారతి సిఇఒను మా -ఎపి తరపున లిఖిత పూర్వకంగానూ కోరామని చెప్పారు. ఒటిటి వెబ్ సైట్లు, సోషల్ మీడియాలపై సెన్సార్ విధిగా ఉండితీరాలని అన్నారు.

కోడెల శివరాంతో ఎమ్మెల్సీ చిరంజీవిరావుచర్చలు

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్



సత్తెనపల్లి నియోజకవర్గ యువ నాయకులు కోడెల శివరాంతో ఎమ్మెల్సీ చిరంజీవిరావు సోమవారం చర్చలు జరిపారు. సత్తెనపల్లి పట్టణంలోని కోడెల కార్యాలయంలో శివరాంతో ఆయన చర్చించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చర్చించారు. కోడెల శివప్రసాద్ అంటే తమకు గౌరవమని, కోడెల కుటుంబానికి సముచిత స్థానం కల్పిస్తామని శివరామ్‌కు ఆయన హామీ ఇచ్చారు. కోడెల కుటుంబం సేవలను పార్టీకి వినియోగించుకుంటామని, కోడెల కుటుంబానికి పార్టీ అండగా వుంటుందని వివరించారు. చంద్రబాబు స్పష్టమైన హామీ ఇస్తే పార్టీ గెలుపు కోసం పనిచేస్తానని చెప్పినట్లు సమాచారం.



మృతుడు సుబ్బారావు కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పుల్లారావు

సుబ్బారావుకు పుల్లారావు నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం నియోజకవర్గ సీనియర్ నాయకులు అబ్బరాజు సుబ్బారావు ఆకస్మిక మృతిపై టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుబ్బారావు స్వగృహం వద్ద మృతదేహాన్ని సోమవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. సుబ్బారావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. సుబ్బా రావు మృతి టిడిపికి తీరనిలోటని అన్నారు.

నాగేశ్వరస్వామి దేవస్థానంలో రేపు పున:ప్రతిష్ట

చిలకలూరిపేటలోని స్థానిక కళామందిర్ సెంటర్‌లోని శ్రీ గంగా బాల త్రిపుర సుందరి సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 20 న ఉదయం 9:58 గంటలకు పున:ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.దేవాదాయ శాఖ చిలకలూరిపేట కార్య నిర్వాహణాధికారి ఆర్. సాయిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



పలు గ్రామాల్లో పోలీసులు కవాతు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని మాదల, ఇరుకుపాలెం,పలుదేవర్లపాడు,నార్నెపాడు గ్రామాల్లో సత్తెనపల్లి రూరల్ సిఐ రాంబాబు,ముప్పాళ్ల ఎస్ఐ హజరతయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిరవ్హించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామనీ ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎఎస్ఐ హిమామ్ కానిస్టేబుల్ మరళి పాల్గొన్నారు.

'కోడ్'ను పకడ్బందీగా అమలు చేయాలి

- అధికారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశం
- ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సంబంధిత ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, మండల అధికారు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటా మని, వాలంటీర్లు ఎవరైనా ఎన్నికల విధు లలో ఉన్నట్లయితే వారిని విధుల నుండి తొలగిస్తామని చెప్పారు.

ప్రభుత్వ కార్యా లయాల్లో ఉన్న పోస్టర్లను వెంటనే తొల గించాలని, దిన పత్రికలలో వచ్చే ప్రతి కూల వార్తలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించి తగిన చర్యలు తీసుకోవా లని అన్నారు. సి విజిల్ యాప్ ను ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకోవాలని, ఈ యాప్‌లో వచ్చిన అంశాలను 100 నిముషాలలో సంబంధిత అధికారుల ద్వారా శీఘ్రమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రిటర్నింగ్ అధికారి వారి కార్యా లయం ఎక్కడుందో సైన్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా కొనసాగిస్తున్న అత్య వసర సర్వీసులను కొనసాగించ వచ్చని చెప్పారు.ఈ సందర్భంగా సి విజిల్ నోడల్ అధికారి రామకృష్ణ ఈ యాప్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ ఎల్.శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, రెవెన్యూ అధికారి వినాయకం

డబుల్ ఎంట్రీలపై చర్యలు తీసుకోండి

ఎన్నికల నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక తహశీల్ధార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికల నియమనిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రతినిధి జూలకంటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాలో ఉన్న డబుల్ ఎంట్రీలపై తాము ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వాటిపై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య మాట్లాడుతూ వాలెంటీర్ల వద్ద ఉన్న సంక్షేమ పథకాల లబ్దిదారుల వాట్సఫ్ గ్రూప్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అటువంటి ప్రచారాలుంటే ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ఆర్ఓ శ్యామ్ ప్రసాదు సూచించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాదు ఆయా పార్టీల నాయకులతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున నియమావళికి లోబడి ప్రచారం నిర్వహించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఒ ఎ.శ్యామ్‌ప్రసాద్

శాలివాహనుల సమస్యలను పరిష్కరిస్తా : ఎంపి

ప్రజాశక్తి - రెంటచింతల

శాలివాహనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారి కోర్కెలు చాలా సహజమైనవని నరసరావుపేట టిడిపి లోకసభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం శాలివాహన సాధికార సంఘ కన్వనీర్ టిడిపి మండల ఉపాధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు నేతత్వంలో పలువురు నరసరావుపేట వెళ్లి ఎంపికి వినతి పత్రం అందజేశారు. 25 సెంట్లు స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆ వినతి పత్రంలో కోరారు.

శావల్యాపురంలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి-వినుకొండ

సార్వత్రిక ఎన్నికలు కోడ్ రావడంతో పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి శావల్యాపురం మండలం కారుమంచి, మతుకుమల్లి, బొందిలపాలెం గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలు పోలీస్ రూట్ మార్చ్ కార్యక్రమం చేపట్టారు. రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రత్యేక బలగాలతో గ్రామాల్లో కవాతు నిర్వహించారు.


రాజకీయ ఉద్దండులు ప్రాతినిధ్యం వహించిన

నరసరావుపేట పార్లమెంట్ స్థానంలో గెలుపు ఎవరిదో?

ప్రజాశక్తి -కారంపూడి

నరసరావుపేట లోక్‌సభ స్థానానికి మంచి గుర్తింపు ఉందని చెప్పవచ్చు. గతంలో నర్సరావుపేట నుంచి ప్రాతినిధ్యం వహించి గెలుపొందిన కాసు. బ్రహ్మానం దరెడ్డి ఏకంగా ఇందిరాగాంధీని సైతం ఎది రించి రెడ్డి కాంగ్రెస్ ను ఏర్పాటు చేశారని చెబు తుంటారు. కాసు బహ్మానందరెడ్డి నరస రావుపేటను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. రాజకీయ ఉద్దండులు, మాజీ ముఖ్యమంత్రులు కాసు. బ్రహ్మ నంద రెడ్డి, నేదురుమల్లి. జనార్ధనరెడ్డి, కొణిజేటి రోశయ్య లు నరసరావుపేట లోక్ సభ స్థానం నుంచి గెలిసి ప్రాతినిధ్యం వహించారు. ఇప్పటివరకు నరసరావుపేట పార్లమెంట్ ఏర్పడ్డ తరువాత దాదాపుగా 15 మంది ఈ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించారు.

2024 సర్వత్రిక ఎన్నికలలో అధికార పార్టీ వైసిపి నెల్లూరు జిల్లాకు చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌ను నరస రావుపేట లోక్ సభ అభ్యర్థిగా ప్రకటించి నప్పటికి టిడిపి, జనసేన, బీజేపీ కూట ములు నరసరావుపేట లోక్ సభ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలును ప్రకటించారు. వైసిపి అభ్యర్థి అనిల్ 2019 ఎన్నికలలో నెల్లూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిసి రాష్ట్ర మంత్రిగా పని చేశారు. శ్రీకృష్ణదేవరాయలు 2019 లో నరసరావుపేట లోక్ సభ స్థానం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఇటీవలే వైసీపీని వీడిన ఆయన టిడిపిలో చేరారు. టిడిపి నరస రావుపేట టికెట్ ఆయనకు లావుకు బరిలో నిలిపింది. మాజీ ముఖ్య మంత్రులు, రాజకీయ ఉద్దండులు, రాజకీయ మేధావులు ప్రతినిధ్యం వహించిన నరస రావుపేటలో ఇప్పటి వరకు ప్రాతినిధ్యం వహించిన లోక్ సభ అభ్యర్థుల కంటే పిన్న వయస్సులోనే శ్రీకృష్ణదేవరాయలు నరస రావుపేట లోక్ సభకు ఎంపికయ్యారు. అంతేకాకుండా, ఇప్పటివరకు గెలిచి ప్రాతినిధ్యం వహించిన అభ్యర్థుల కంటే శ్రీకృష్ణదేవరాయలు గత ఎన్నికలలో టిడిపి అభ్యర్థి రాయపాటి సాంబశివరావుపై 1,53,970 ఓట్ల భారీ మెజారిటీతో ల విజ యం సాధించారు.



ఇప్పటివరకు నరసరావుపేట నుంచి పోటీచేసిన వారందరి కంటే అత్యధిక మెజారిటీతో గెలుపొంది మొదటి వరు సలో నిలిచారు. కాసు బ్రహ్మానందరెడ్డి సైతం 1977,1980 జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో నరసరావుపేట నుంచి రెండు సార్లు విజయం సాధించారు. 1967, 1971 జరిగిన లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి మద్ధి. సుదర్శనం వరుసగా రెండు సార్లు విజయం సాధించారు. అలాగే కాసు. బ్రహ్మానందరెడ్డి సోదరుడి కుమారుడైన కాసు వెంకటకృష్ణారెడ్డి 1989,1991 లో జరిగిన లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వరుసగా రెండు సార్లు విజ యం సాధించారు.

నరసరావుపేట పార్లమెంట్ స్థానా నికి నెల్లూరు జిల్లాకు విడదీ యారని బంధం ఉందని తెలుస్తుంది. 1999 లో నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ ముఖ్య మంత్రి నేదురుమల్లి. జనార్దనరెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి అప్పటి టిడిపి అభ్యర్థి లాల్ జానీబాషాపై పోటీచేసి విజయం సాధించారు.

2004లో జరిగిన ఎన్నికలలో నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి. రాజ మోహన్ రెడ్డి నరసరావుపేట లోక్ సభ అభ్యర్థిగా కాంగ్రెస్ నుండి పోటీచేసి అప్పటి టీడీపీ అభ్యర్థి లక్ష్మయ్య పై విజ యం సాధించారు. నెల్లూరు నుంచి బరిలో నిలిచిన అభ్యర్డులు సైతం విజయం సాధించడంతో ఈ సారి 2024 ఎన్నికలలో నరసరావుపేట నుండి బరిలో ఉన్న నెల్లూరు జిల్లాకు చెందిన అనిల్ కుమార్ కు నరసరావుపేట పార్లమెంట్ ప్రజలు ఆశీర్వాదిస్తారా అనే సందేహం పల్నాడు రాజకీయాల్లో తలెత్తింది. నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కువ శాతం ఒసి అభ్యర్థులే బరిలో ఉండి విజ యం సాధించారు. మరోపక్క ఎన్నికల కమిషన్ ఇటీవలే ఎన్నికల నోటిఫికేషన్ కూడా ప్రకటించడంతో పార్లమెంట్ పరి ధిలో ప్రచారాలను ముమ్మరం చేసేందుకు సిద్ధం అయ్యారు. ఇప్పటికే వైసిపి సిద్ధం సభలతో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. టిడిపి,జనసేన, బిజెపి కూటములు నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని చిలకలూరిపేటలో ప్రజాగళం సభ నిర్వ హించారు. ఏదిఏమైనా నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో ఇరుపార్టీల ప్రచా రాలతో రాజకీయం వేడెక్కింది.

వైసిపికి అనుకూలంగా వాలంటీర్ల భర్తల ప్రచారం

- **కేసుల పేరుతో కార్యకర్తల్ని తీసుకెళ్లి పోలీసుల వేధింపులు**
- **రాజకీయ పార్టీలతో జెసి సమీక్షలో నాయకుల ఫిర్యాదు**

ప్రజాశక్తి - మంగళగిరి

ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మంగళగిరి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి కోరారు. ఎన్నికల నియమావళిపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో సోమవారం సమావేశమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసే పార్టీల వారందరూ ప్రతిదానికీ పర్మిషన్ తీసుకోవాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో 300 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ కేసుల పేరుతో తమ కార్యకర్తలను పోలీసులు తీసుకువెళ్లి వేధింపులు గురి చేస్తున్నారని చెప్పారు. రౌడీషీట్ ఉన్నవారు అన్ని పోలీస్‌స్టేషన్లో ఫొటోలు ఉంటాయని, వారిని కాకుండా వేరే వారిని వేధింపులు గురి చేస్తున్నారని చెప్పారు. వాలంటీర్ల భర్తలు వైసిపికి అనుకూలంగా పనిచేస్తున్నారని చెప్పారు. సిపిఎం నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ ఏజెంట్లు నియమించే ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. చిన్నచిన్న కేసుల్లో ఉన్నా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ జంగయ్య మాట్లాడుతూ పోలీసులు పాత కేసులని చెప్పి వేధిస్తున్నారని తెలిపారు. టిడిపి నాయకులు జి.దుర్గారావు మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో 27, 29 వార్డుల్లో ఉన్న యానిమేటర్లు మహిళలను సమావేశపరిచి రుణమాఫీ చేస్తామని, మరలా లోన్ ఇస్తామని ప్రలోభాలకు గురిచేస్తున్నారని చెప్పారు. సమావేశంలో సిఐ ఎం.శ్రీనివాసరావు, మంగళగిరి తహశీల్దార్ కె.వెంకటేశ్వరరావు, రమేష్ కుమార్, అడిషనల్ కమిషనర్ కె.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి



చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

రానున్న ఎన్నికల్లో తమకు సముచిత స్థానం కల్పించాలని వడ్డెర సాధికారత రాష్ట్ర సభ్యులు వడ్డె వెంకట్ కోరారు. సోమవారం సాయంత్రం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో సాధికారత మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు వేముల శివ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. వెంకట్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గలో తమకు 10 వేల ఓట్లు ఉన్నాయని, తమకు ఒక్క అసెంబ్లీ సీటైనా కేటాయించాలని కోరారు. బిసి సెల్ అధ్యక్షులు తిరుపాల్‌బాబు, రాష్ట్ర నాయకులు జి.అంకమ్మరావు మాట్లాడుతూ చంద్రబాబు గతంలో తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా ఏ రాజకీయ పార్టీ తమకు సీట్లు కేటాయించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షులు జయలక్ష్మి, జి.శ్రీనివాసరావు, యు.వాసు, రామకృష్ణ, దుర్గారావు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేసింది ప్రధాని మోడీయే : కాంగ్రెస్

ప్రజాశక్తి-తెనాలి

ఐదేళ్లుగా మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట, విభజన చట్టంలో పొందుపరచిన ప్రత్యేక హోదా అమలు కాని వైనానికి ప్రధాని మోడీయే కారణమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. స్థానిక మారీసుపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్ర విజయవంతంగా ముగించి, దేశంలో మెజారిటి ప్రతిపక్షాల మన్ననలను పొందటం అభినందనీయమన్నారు. ఈనెల 17న చిలకలూరిపేటలో ప్రజాగళం సభలో పాల్గొన్న ప్రధాని మోడీ పదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రానికి 11 సంస్థలను తెచ్చినట్లు చెప్పారని, అవి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న పల్లంరాజు విభజన చట్టంలో పొందుపరచిన సంస్థలేనని, మోడీ కొత్తగా రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదని అన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన ప్రత్యేక హోదా అంశాన్ని మోడీ తుంగలో తొక్కి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. సభలో టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అమరావతి రాజధాని అంశాన్ని ప్రస్తావించినా మోడీ దానిపై స్పందించలేదన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రానికి ప్రధాని ఏం చేశారు, ఏం చేస్తారో కూడా చెప్పలేకపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ముఖ్యమంత్రి దోబూచులాడుతున్నారని, మోడీ అనుమతి లేకుండా మూడు రాజధానుల ప్రతిపాదన జగన్ చేయగలరా? అని ప్రశ్నించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగన్, ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపి కూటమి వైఖరిని గమనించాలన్నారు. అధికారంలోకి వస్తే ప్రత్యేకహోదాపై తొలి సంతకం, అమరావతి రాజధానిగా కొనసాగిస్తామని ప్రకటన చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు. సమావేశంలో నాయకులు పి.నాగసూర్యశశిధరరావు, బుల్లియ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చందు సాంబశివుడు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

క్రైస్తవ సమాధులున్న ప్రాంతాల్లో శుభ్రం చేయించాలని వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 29న గుడ్‌ఫ్రైడే, 31న ఈస్టర్ పండుగ సందర్భంగా తాడేపల్లి పట్టణంలోని అమరారెడ్డినగర్, ఆశ్రమం రోడ్డు చివర, మహానాడు తదితర ప్రాంతాల్లో క్రైస్తవ సమాధులు ఉన్న చోట శుభ్రం చేయించాలని ఎంటిఎంసి కమిషనర్ నిర్మల్‌కుమార్‌కు వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎం.ప్రకాష్ సోమవారం వినతిపత్రం అందజేశారు. రెండు పండుగలు వెంటవెంటనే ఉన్న సందర్భంగా సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుంటాయని తెలిపారు. పిచ్చిమొక్కలతో పాటు అపరిశుభ్ర వాతావరణం అక్కడ నెలకొని ఉందని తెలిపారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.అనిల్, జి.సుదర్శనం, కె.ఉదయరాజు, ఎం.విజయకుమార్, బి.భాస్కర్, ఆర్.ఎలీషా పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ప్రజలతో లోకేష్ రచ్చబండ

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనను మంగళగిరి నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో గెలిపించాలని టిడిపి అభ్యర్థి నారా లోకేష్ ప్రజలను కోరారు. మండలంలోని చింతలపూడి, మంచికలపూడి, కంఠంరాజు కొండూరు గ్రామాల్లో సోమవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. తనకు నటన రాదని, అది వస్తే గత ఎన్నికల్లోనే గెలిచి ఉండేవాడిని అన్నారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి పదేళ్లు ఎమ్మెల్యేగా చేసి ఏమి చేశారని ప్రశ్నించారు. మంగళగిరి, ఆత్మకూరు, ఇప్పటంలలో ఇళ్లు కూల్చివేశారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఏడు రకాల భూములకు సంబంధించిన వారికి రెగ్యులరైజ్ చేస్తామని, దీనిపై చంద్రబాబు హామీ ఇచ్చి ఉన్నారని చెప్పారు. డొంక రోడ్లతోపాటు పలు సమస్యలను స్థానికులు ప్రస్తావించగా లోకేష్ స్పందిస్తూ ఫెవికాల్ టైపులో కొత్తరకం టెక్నాలజీ వచ్చిందని దానిని రోడ్లమీద ఉపయోగిస్తే అన్ని కాలాల్లోనూ రోడ్లు పటిష్టంగా ఉంటాయన్నారు. దుగ్గిరాల నుండి చింతలపూడి వరకు మూడో నెంబర్ బ్రాంచ్ కాల్వలో పూడిక తీత సమస్యను పరిష్కరిస్తామని, కృష్ణా జిల్లా నిమ్మకూరులో మాదిరి ఒక్క దోమ కూడా రాకుండా భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను చేపడతానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్ధయ్య, మండల అధ్యక్షులు కె.శ్రీఅనిత, సర్పంచ్ రామకృష్ణ, గద్దె శ్రీనివాస్, వి.నరసింహారావు, మండల అధ్యక్షులు పి.శ్రీనివాస్, ఈమని ఎంపిటిసి పి.సాయిచైతన్య పాల్గొన్నారు.



చింతలపూడిలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న నారా లోకేష్



టిడిపిలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-మంగళగిరి

పట్టణానికి చెందిన బీసీ నాయకులు ఆకురాతి నాగేంద్రం సహా 200 కుటుంబాలు నారా లోకేష్ సమక్షంలో సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో టిడిపి చేరారు. వీరికి లోకేష్ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగేంద్రంతో పాటు జి.నాగార్జున, కె.వెంకటరమణ, కె.వేణు, కె.విజయ్, పి.రవి, ఎం.శ్రీనివాస్, వి.వసంత, ఎ.శ్రీను, సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎన్.వెంకటరత్నం తదితరులు టిడిపిలో చేరారు. లోకేష్ మాట్లాడుతూ బంగారు నగల పేరు చెబితే మంగళగిరి గుర్తొచ్చేవిధంగా మంగళగిరి ప్రాంతాన్ని గోల్డ్ హబ్‌గా తీర్చిదిదుతామని చెప్పారు. స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్ధయ్య, టి.జానకీదేవి, డి.రాజు, షేక్ రియాజ్, జి.దుర్గారావు, జె.రాము, ఎం.రాము, సిహెచ్.వెంకటేశ్వరరావు, జి.నాగరాజు, వి.రమేష్, కె.కొండలు, వి.నరేష్ పాల్గొన్నారు.



12 పథకాల లక్ష్యంతో పోటీ

ప్రజాశక్తి - చేబ్రోలు

రాజకీయ ప్రక్షాళన కోసం పొన్నూరు నియోజకవర్గం వైపు నా తొలి అడుగు అని మాదిగ మహాజన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వరికుంట రాజేష్ (రోశయ్య) అన్నారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు రూ.కోట్లతో ఓట్లను కొని గెలిచి ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని, రాష్ట్ర సంపదను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. నియోజకవర్గానికి చెందిన సామాన్యుడిగా స్వతంత్ర అభ్యర్థిగా తాను 12 సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజల్లోకి వస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో లక్ష ఉద్యోగాలు కల్పించి ప్రతి మండలంలో 100 పడకలతో ప్రభుత్వ ఆస్పత్రి, 100 పడకలతో వృద్ధాశ్రమం ఏర్పాటు, ప్రతి మండలంలో జూనియర్, డిగ్రీ ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు తన లక్ష్యమన్నారు. పరిశ్రమలు ఏర్పాటుతోపాటు రైతుల పంటలను మంచి ధరలకు ప్రభుత్వమే కొనుగోలు చేయడం, మెరుగైన విద్య, పారిశుధ్యం తదితర ప్రణాళికలతో తాను పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిమ్ మైనార్టీల రాజ్యాధికారమే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జి.మార్తమ్మ, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ములుకుదురులో మురళీకృష్ణ పర్యటన

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

గ్రామాల అభ్యున్నతికి కృషి చేస్తానని పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని ములుకుదురులో స్థానిక వైసిపి నాయకులతో కలిసి ఆయన సోమవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తనను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. నాయకులు షేక్ నాజర్, ఎ.వెంకటేశ్వరరావు, ఆర్.ఆదిశేషు, బి.వంశీరెడ్డి, కె.వెంకట సుబ్బారావు, ఎ.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, రఘురాం పాల్గొన్నారు.



ఫిరంగిపురంలోని సమ్మె శిబిరంలో అర్ధనగ్న ప్రదర్శనలో నిరసన తెలుపుతున్న కార్మికులు

9 నెలల జీతాల కోసం అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - ఫిరంగిపురం, పెదకాకాని

తమకు 9 నెలల జీతం బకాయిలు చెల్లించాలని కోరుతూ మండల కేంద్రమైన ఫిరంగిపురంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 8వ రోజు కొనసాగుతోంది. సోమవారం ఆందోళనలో భాగంగా కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనలతో నిరసన తెలిపారు. యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఇబ్రహీం సిహెచ్ రామారావు, బాలస్వామి, శ్రావణ్, మస్తాన్‌వలి, ప్రభుదాస్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్మికుల ఆందోళనకు మద్దతుగా మండల కేంద్రమైన పెదకాకానిలోని పంచాయతీ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.శివాజీ మాట్లాడుతూ నెలల తరబడి కార్మికులకు జీతాలివ్వకుంటే వారేమి తిని బతకాలని ప్రశ్నించారు. వారికి సత్వరమే జీతాలు చెల్లించాలని, సబ్బులు, నూనె, యూనిఫామ్, మాస్కులు, గ్లౌజులు, చెప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెండర్లు ప్రతిపాదన పంపాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో రాజా, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.



ఫిరంగిపురం కార్మికులకు మద్దతుగా పెదకాకానిలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

అభ్యర్థుల ఖర్చులను పక్కాగా నమోదు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల నిర్వహణలో ఎక్స్‌పెండీచర్ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని, కమిటి సభ్యులు అత్యంత జాగ్రత్తగా రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రచార ఖర్చులను రికార్డ్ చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్ఓ) కీర్తి చేకూరి ఆదేశించారు. ఈ మేరకు ఎక్స్‌పెండిచర్ కమిటీ అధికారులతో కమిషనర్ తన ఛాంబర్‌లో సోమవారం సమావేశమయ్యారు. కమిటీలో అధికారులందరూ తప్పనిసరిగా ఎన్నికల సంఘం అందించిన హ్యాండ్ బుక్‌లెట్ సమగ్రంగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి ఖర్చు సంబంధిత ఖాతాలో రికార్డ్ చేయాలని, ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్, ఆర్.ఓ.లకు నిర్దేశిత ప్రొఫార్మాలో రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల ర్యాలీలు, ప్రచార సభలు, కార్యకర్తల ఖర్చులు, ప్రచార సామగ్రి తదితర అంశాల వారీగా ఖర్చులు రికార్డ్ చేయాలన్నారు. సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగేంద్ర కుమార్, ఎంసిసి టీం నుండి శ్రీధర్ పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అధికారులతో సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ మేరకు నగరంలోని ప్రభుత్వ భవనాలపై ఉన్న వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాల తొలగింపు ప్రక్రియ సోమవారం సాయంత్రానికి పూర్తి చేయాలని ఆదేశించారు. పార్కులు, అంతర్గత రహదారుల్లో కూడా ఎటువంటి రాజకీయ పార్టీల ప్రచార బ్యానర్లు, పోస్టర్లు ఉండటానికి వీలు లేదన్నారు. ప్రతి అధికారి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సంతకంతో కూడిన నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ఆఫీసులకు కూడా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మాత్రమే జెండాలను బ్యానర్లు ఏర్పాటు చేసుకునేలా తెలియచేయాలని, నిబంధనలు విరుద్ధంగా ఉన్న వాటిని తక్షణం తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు అత్యంత కీలకమని ప్రతి ఒక్కరూ కేటాయించిన విధుల పట్ల అంకిత భావం బాధ్యతగా లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఈ శ్యాంసుందర్, సిఎంఓహెచ్ డాక్టర్ ఆషా, డిప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి, ఎ.ఆర్.ఓ లు సునీల్, భీమరాజు, ఎం.సి.సి టీం శ్రీధర్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న గుంటూరు కమిషనర్, తూర్పు నియోజకవర్గ (ఆర్ఓ) కమిషనర్ కీర్తి

ఎన్ఎంఎంఎస్ విద్యార్థులు బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

నేషనల్ మీన్స్-కం-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో 2019-2022 మధ్య సంవత్సరాల్లో ఎంపికై, ఈ సంవత్సరం 9, 10, 11, 12 తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు/రెన్యువల్ చేసుకున్న ప్రతి విద్యార్థి తప్పకుండా తమ బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీడింగ్ చేయించుకోని ఎడల స్కాలర్‌షిప్ జమ కాదని, విద్యార్థి తమ మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌తో బ్యాంకుకు వెళ్లి ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఆధార్‌కు సీడ్ అయిన బ్యాంకు ఖాతాకే డైరెక్టర్ బెన్ఫిట్ ట్రాన్స్‌ఫర్(డిబిటి) విధానంలో స్కాలర్‌షిప్ జమ చేస్తారని, స్కాలర్‌షిప్ స్టేటస్ విద్యార్థి లాగిన్‌లోనే తెలుస్తుందని, కావున తరచూ తనిఖీ చేసుకోవాలని సూచించారు.

ఎల్ఐసి ప్రగతిలో ఏజెంట్ల ముఖ్యభూమిక

ప్రజాశక్తి-గుంటూరు

ఎల్ఐసి సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిలో ఏజెంట్లు పోషిస్తున్న పాత్ర అభినందనీయమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. సోమవారం 'మెగా బిజినెస్ డే' సందర్భంగా అత్యధిక పాలసీలు చేసిన ఎల్ఐసి ఏజెంట్లను అరండల్‌పేట ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ జాతీయీకరణ నాటి నుండి పాలసీదారులకు విశిష్టమైన సేవలందిస్తూ ఎల్ఐసి దేశ ప్రగతికి రూ.లక్షల కోట్ల పెట్టుబడులను అందిస్తోందని అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీమా వ్యాపారంలో ఎదురవుతున్న గట్టి పోటీని తట్టుకుని సుమారు 13 లక్షల మంది ఏజెంట్లు ఎల్ఐసిని అగ్రగామి సంస్థగా నిలపటంలో కీలక భాగస్వాములయ్యారని ప్రశంసించారు. కార్యక్రమానికి సీనియర్ బ్రాంచి మేనేజర్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ బి.రవీంద్ర, జె.రాజేంద్రప్రసాద్, ఎ.సత్యవాణి, ఎస్.కృష్ణారెడ్డి, జి.బాలాజీ, కనక రాజలక్ష్మి, ఎ.సుబ్బాయమ్మ, ఆర్.వి.ఎస్. శ్రీనివాస్, డి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



ఏజెంట్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ఛైర్మన్ తదితరులు

మలినేని విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో 36 మందికి ప్రముఖ అంతర్జాతీయ సంస్థ క్యాప్ ఓమినిలో ఉద్యోగాలు సాధించారని కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు తెలిపారు. ఆయా విద్యార్థులను సోమవారం ఛైర్మన్ అభినందించారు. ఉద్యోగం సాధించిన వెంటనే అలసత్వం వహించకుండా ఇంకా పట్టుదలతో ముందుకు వెళ్లాలని అన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల ఉపాధి కల్పన అధికారి డాక్టర్ కె.శ్వేత, ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డీన్‌లు డాక్టర్ పోపూరి రమేష్‌బాబు, ప్రొఫెసర్ కిషోర్‌బాబు, డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసకుమార్ తదితరులున్నారు.

విజ్ఞాన్స్ ఫార్మసీతో సీఎస్‌సీ అకాడమీ ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాల భారత ప్రభుత్వంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ విభాగంతో నిర్వహిస్తున్న విశాఖపట్నంలోని సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) అకాడమీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎస్‌సీ అకాడమీ వర్చువల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ రామ్‌మోహన్‌రావు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన విద్యార్థులకు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్ టెక్నాలజీపైన ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందిస్తామన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు ఉపయోగపడే విధంగా పరస్పర అవగాహనతో కళాశాలలోకానీ, వర్చువల్‌గా కానీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. సీఎస్‌సీ అకాడమీ వర్చువల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ రామ్‌మోహన్‌రావు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఇండస్ట్రీ గానీ, వృత్తితో సంబంధం లేకుండా డిజిటల్ ప్రపంచంలో వస్తున్న సాంకేతికతను స్వీకరించాలన్నారు. విద్యార్థులకు నైపుణ్యాలను పెంచే ప్రయత్నంలో విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాలతో భాగస్వామి అయినందుకు మేము సంతోషిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న రామ్‌మోహనరావు, డాక్టర్ శ్రీనివాసబాబు

5న ఎపిజిఇఎ జిల్లా కార్యవర్గ ఎన్నికలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏప్రిల్ 5న నిర్వహిస్తున్నట్లు ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా తెలిపారు. స్థానిక నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చాంద్‌బాషా మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారిగా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.నాగసాయి, రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్ సహ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారన్నారు. మార్చి 28న ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంటల వరకు సంఘం జిల్లా కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 29న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంటలోపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఏప్రిల్ 5న సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఎన్నికలు జరుగుతాయని, తర్వాత ఓట్ల లెక్కింపు చేపడతారన్నారు. ఈ ఎన్నికల్లో 8 తాలూకా యూనిట్‌ల నుండి 137 మంది కార్యవర్గ సభ్యులు, నగర శాఖ కార్యవర్గ సభ్యులు ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకుంటారని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, సహాధ్యక్షులు మహేష్‌బాబు, జిల్లా ఆర్గనైజ్ సెక్రెటరీ కరీముల్లా షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, నగర అధ్యక్షులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.